దళితుల సంక్షేమానికి కృషి



బాబు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడిగా బాబు శ్రీనివాస్ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆదివారం ఆయనను సన్మానించారు. అనంతరం బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ.. దళితుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చౌకి రవికుమార్, చీపిరి రాజారావ్ గౌడ్, మహ్మద గౌస్, గడ్డం నరేందర్, విజయ్‌కుమార్, రాజేష్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నాగోలు: శ్రీ వైష్ణవి చారిటబుల్ వ్యవస్థాపకులు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి సభ్యుడు మంత్రి సునీల్(55) నాగోలు బండ్లగూడలోని ఆయన నివాసంలో ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మంత్రి సునీల్ శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యాదానం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగారని పలువురు పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, ఇతర బ్రాహ్మణ సంఘాల నాయకులు, ట్రస్టు సభ్యులు సునీల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. దేవుపల్లి రంగారావు, శివకుమార్, శేషగిరిరావు, గూడ జయరాం, గూడ రాజేశ్వరరావు, సర్వ రఘు, అక్కిరాజు, దుర్గా ప్రసాద్, చెన్నూరి లక్ష్మీనరిసింహారావు, కానాల శ్యామ్‌సుందర్ రావు సునీల్ మృతదేహానికి నివాళి అర్పించారు.

వృద్ధ దంపతులపై దాడి

వ్యక్తిపై కేసు నమోదు

హస్తినాపురం: ఇంట్లో ఒంటరిగా ఉన్న వయోవృద్ధులపై భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం సెక్రటరీ రవికిరణ్ దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..ద్వారకామాయినగర్ కాలనీలో ఉంటున్న వయోవృద్ధులైన గుత్త లక్ష్మీతులసీ, వేణుగోపాల్ దంపతుల ఇంటికి భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం సెక్రటరీ రవికిరణ్ కుమారుడు వచ్చి పనులకు ఆటంకం కలిగించేవాడు. దీంతో వేణుగోపాల్ ఇంటికి రావొద్దని చెప్పడంతో నన్నుకొట్టాడని రవికిరణ్‌కు అతడి కుమారుడు చెప్పడంతో కోపోద్రిక్తుడైన రవికిరణ్ తన అనుచరులతో కలిసి ఆ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడ్డాడు.బాధితుల ఫిర్యాదు మేరకు రవికిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి



స్వచ్ఛ ర్యాలీలో కమిషనర్ శైలజ, కాలనీ వాసులు

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ నడుం బిగిద్దామని బోడుప్పల్ కమిషనర్ శైలజ పిలుపునిచ్చారు. కేశవనగర్ కాలనీ అధ్యక్షుడు బసవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛ కేశవనగర్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని, చెత్త,చెదారాన్ని ఇష్టానుసారంగా పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. కాలనీలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారంగా చెత్త వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తు తరాలకోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం పార్కులో వ్యర్థాలను తొలగించి ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా లింగమయ్య కల్యాణం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో లింగమయ్యస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మూడురోజులుగా జాతర కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లింగమయ్య స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆదిబట్ల పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. సుమారు పదివేల మందికి అన్నప్రసాదం అందించారు. దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. పార్టీలకతీతంగా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాదర్‌గుల్ గ్రామస్తులు, పలు గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు.

పైకి మినరల్.. లోపల జనరల్

నీటిశుద్ధి పేరుతో జల దోపిడీ | పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు
పట్టించుకోని అధికారులు | జేబులు నింపుకుంటున్న నిర్వాహకులు





బండ్లగూడలోని ఓ వాటర్ ప్లాంట్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఎటు చూసినా తాగునీటి కొరత వేధిస్తోంది. జలమండలి సరఫరా చేసే నీరు సరిపోకపోవడంతో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.ఇదే అదనుగా భావిస్తున్న మినరల్ ప్లాంట్ల యజమానులు ఎలాంటి శుద్ధి చేయకుండా మినరల్ వాటర్ పేరుతో నీటిని విక్రయిస్తూ దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నీటి శుద్ధిపేరుతో ప్లాంట్ల నిర్వాహకులు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వాటర్ ప్లాంట్లకు ఎలాంటి అనుమాలు లేకపోవడంతో పాటు కనీసం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వందల సంఖ్యలో తాగునీటి శుద్ధి కేంద్రాలు నడుస్తున్నాయి. కేంద్రాల వద్ద 20 లీటర్ల క్యాన్ నీటితో నింపితే రూ. 15, ఇంటికి తీసుకొస్తే రూ. 30 వరకు వసూలు చేస్తున్నారు.

300లకు పైగా వాటర్ ప్లాంట్లు..

ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధి వివిధ డివిజన్లలోని బస్తీల్లో దాదాపు 300లకు పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అక్కడ శుద్ధి చేసిన మినరల్స్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నారు. ఈ కేంద్రాలకు బీఐఎస్ అనుమతి ఉండాలి. ప్రతి రెండు నెలలకోసారి అధికారులు వీటిలో తనిఖీలు నిర్వహించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. దీంతో నిర్వాహకులు ప్లాంట్లలో బోరు నీటినే శుద్ధి చేసినట్లు చెబుతూ మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో బోర్ల నుంచి వస్తున్న కలుషిత నీటినే శుద్ధి చేసిన నీటి పేరుతో విక్రయిస్తున్నారు. వాటర్ ప్లాంట్లపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీటి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొసాగుతుంది.

కానరాని తనిఖీలు..

వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేయాల్సిన జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దు. స్థానికులు ఏదైయిన ఫిర్యాదు చేస్తే అధికారులు వచ్చి నామామాత్రంగా తనిఖీలు చేసిన ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లపై ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా నీటి క్యాన్లు

అపరిశుభ్రత వాతావరణంలో..

వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల వద్ద నీటి వ్యాపారం కొనసాగించే నిర్వాహకులు వారి వద్ద ఉన్న క్యాన్లలో, ట్యాంక్‌లు శుభ్రం చేయకుండా అలాగే విక్రయిస్తున్నారు. వాటర్ డబ్బాల్లో నీరు నిల్వ ఉంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న అక్రమ నీటి వ్యాపారం చేస్తున్నారు. అపరిశుభ్రత వాతావరణంలో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

రాచకాలువపై కబ్జాలను తొలగించాలి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్ మేడోస్ కాలనీలో నుంచి వెళ్తున్న రాచ కాలు కబ్జాకు గురైందని వెంటనే కబ్జాలను తొలగించి వరద ముప్పునుంచి కాలనీలను కాపాడాలని కాలనీ అధ్యక్షులు శశికాంత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బృందావన్ మేడోస్ కాలనీలోని కొంత భాగం కాలువ పోతుందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలును కబ్జా చేసి వెంచర్ వేసి ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని హయత్‌నగర్ రెవిన్యూ అధికారులకు విజ్ఞప్తి చేయగా సర్వే చేసి హద్దులు కూడా నిర్ణయించారన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో వర్షాలకు పై నుంచి వచ్చే వరద నీరు తమ కాలనీకి వచ్చి ముంపునకు గురవుతుందని అధికారులు స్పందించి రాచకాలువపై ఉన్న కబ్జాలను తొలగించాలని కోరారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.28, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.16, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.45, కందగడ్డ రూ.75, బీట్‌రూట్ రూ.17, కీర రూ.28, బీన్స్ రూ.95, క్యాప్సికమ్ రూ.47.

ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేతన్నలను ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న సీతారాములు

మన్సూరాబాద్: చేనేత కార్మికులు పొద్దంతా పని చేసినా పూటగడవక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆదుకోక పోగా... కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించడం ఏంటని చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. ఆదివారం నిర్వహించిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేత వృత్తిలో ఎంతో ప్రతిభ నైపుణ్యం కలిగిన కార్మికులు నూలు ధరలు పెరిగి, కూలిగిట్టక బట్టల అమ్మకాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రుణాలు మాఫీ చేస్తామని, నూలుపై సబ్సిడీ ఇస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతేడాది ఆగస్టులో త్రిఫ్ట్ పథకం గడువు ముగిసిన ఇప్పటి వరకు త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించలేకపోయారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మురళీధర్, శంకరయ్య, వెంకటనర్సు, నర్సింహా, రాజేందర్, చెన్న రాజేష్, నారాయణ, పెంటయ్య, శేఖరయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థికసాయం



సాయి సందీప్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు

చైతన్యపురి: శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఓ పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన లింగన్నపేట సాయి సందీప్ పది ఫలితాల్లో 569 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. తండ్రి చనిపోవటం, ఇంటర్ చదివేందుకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా సమితి సభ్యులను కలిసి చేయూతనందించాలని విద్యార్థి కుటుంబ సభ్యులు కోరగా ఆదివారం రూ. 20 వేలు చెక్కు అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధనాచారి, రవిచారి, నర్సింహాచారి, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి



హస్తినాపురం: నందనవనంకాలనీలోని మోడల్ మార్కెట్‌లో నూతన పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రతిపాదనలు చేసి అప్పటి కమిషనర్ మహేష్‌భగవత్ తోమంజూరు చేయిస్తే కాంగ్రెస్ నాయకులు తామే మంజూరు చేయించినట్లు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. ఆదివారం ఆయన మోడల్ మార్కెట్‌లో పర్యటించిన అనంతరం మాట్లాడారు. అప్పటి ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డిని పిలిపించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నందనవనంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పడంతో ఆయన ప్రతిపాదనలు పంపిస్తే మహేశ్‌భగవత్ మోడల్ మార్కెట్ స్థలాన్ని సందర్శించి పోలీస్ ఔట్‌పోస్ట్‌కు అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయడం వాయిదా పడిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంజూరు చేయించిన పోలీస్‌ఔట్ పోస్టును తామే మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంజూరు చేయించిన అభివృద్ధి పనులను తామే మంజూరు చేయించినట్లు ప్రచారం చేసుకోవడం మానుకోవాలని సత్యంచారి హితువు పలికారు.

నవదేవాలయాల సమూహం.. లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణం



వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఒకే ప్రాంగణంలో తొమ్మిది దేవాలయాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. లక్ష్మీగణపతి దేవాలయం, లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, రాజరాజేశ్వరి (శివాలయం) దేవాలయం, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం, జయదుర్గాదేవి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శివనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఈ ప్రాంగణంలో ఉండటంతో నిరంతరం భక్తులతో కిటకిటలాడుతోంది.

–వనస్థలిపురం

ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి అన్నారు. బోడుప్పల్ 13వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ఆదివారం కమల ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో తరుచుగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. వైద్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

అబిడ్స్: అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని రిలయన్స్ హైటెక్ విద్యా సంస్థల డైరెక్టర్, విద్యావేత్త టి.జితేందర్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాల, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్లు సంయుక్తంగా 2024–25 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేసి అభినందించారు. ముందుగా డైరెక్టర్ జితేందర్‌సింగ్, రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నిశాసింగ్, టీఆర్‌ఎస్‌ఎంఏ ఆసిఫ్‌నగర్ మండల గౌరవ అధ్యక్షుడు గాలయ్య, అధ్యక్షుడు రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేందర్ సింగ్ మాట్లాడుతూ..తమ విద్యాసంస్థలు, టీఆర్‌ఎస్‌ఎంఏల ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులను సత్కరించి ప్రతిభా పురస్కారాలను అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను రిలయన్స్ హైటెక్ విద్యా సంస్థలు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు.

న్యూమారుతి నగర్‌లో 'తిరంగా ర్యాలీ'



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ వాసులు

నాగోలు: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన త్రివిధ దాళాలకు మేము సైతం మద్దతు ఇస్తున్నామని కొత్తపేట డివిజన్ న్యూ మారుతీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురి శివాజీ విగ్రహం వరకు తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సీరంకి రవి మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ (ఇద్దరు మహిళా వాయుసేన సిబ్బంది) పాకిస్తాన్ ఉగ్రవాదులను వారి ఆయుధాలను ధ్వంసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రవికేశవ్, అంజనేయులు, అరుణ్ కుమార్, సత్తయ్య, రాంచందర్ కుమార్, ఉపేందర్, కనకయ్య, సభ్యులు నాగభూషణం, సుజాత, మాధవి, కవిత, రజిత, యాదమ్మ, సురేష్ వర్మ , అంజి, ఆశిష్ రావు, వాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు ధర్నా



బండ్లగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బండ్లగూడ గ్రామస్తులు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ, తాగునీటి, రోడ్ల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆదివారం రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్లు తవ్వి పూర్తిగా వదిలేశారని దీంతో గ్రామంలో నడలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడే తాగునీరు రావడంలో లేదని వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటిలో డ్రైనేజీ నీరు కలిసి వస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు కేటాంచిన స్థలంలో భవనం పూర్తి చేసి అక్కడికి తరలించాలని డిమాండ్ చేశారు.బండ్లగూడ సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించాలని లేకుండా ధర్నాను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ధన్‌రాజ్, మెట్టు రవీందర్‌గౌడ్, వంగ శ్యామ్‌కుమార్, సత్యనారాయణగౌడ్, కందికంటి రాఘవేందర్, సహదేవ్‌గౌడ్, భవనిశంకర్, రాము, వినయ్ పాల్గొన్నారు.



పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నెలకొన్న పచ్చదనం



పచ్చందాలను సంతరించుకున్న ఆర్‌సీఐ రహదారి

పరిఢవిల్లిన పచ్చదనం

- మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న పోలీసులు
- మండుటెండల్లోనూ ఆహ్లాదకరమైన వాతావరణం

కనువిందు చేస్తున్న పోలీస్ స్టేషన్ ఆవరణ

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఆవరణ పచ్చదనంతో పరిఢవిల్లుతోంది. ఒకవైపు భానుడి భగభగలతో రోడ్డెక్కాలంటేనే జనం అల్లాడిపోతుండగా.. ఈ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మాత్రం ఠాణా ఆవరణలో ఉన్న భారీవృక్షాలు సేదతీరుస్తున్నాయి. భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ ఆవరణలో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడూ మొక్కలను నాటుతూ సంరక్షిస్తుండడంతో మండుటెండల్లో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది. స్టేషన్‌కు వచ్చే ప్రజలు గంటల తరబడి ఎదురుచూపుల్లో గడపాల్సి వచ్చినా అసౌకర్యానికి గురికాకుండా పచ్చటి లాన్‌తో కూడిన చెట్ల నీడన సేదతీరుతున్నారు. దీంతో పాటు జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం కూడా ఇదే కోవకు వస్తోంది. ఈ కార్యాలయ ఆవరణలో ఉన్న వందల ఏళ్ల వయసు కలిగిన భారీ వృక్షాలతో పచ్చదనాన్ని సంతరించుకొని ఉంటుంది.

రోడ్డుకిరువైపులా..

రాష్ట్రంలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా పదేళ్ల క్రితం హరితహారం పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ప్రస్తుతం వన మహోత్సవం పేరు మార్చుకున్న ఈ పథకం. ప్రతీ సంవత్సరం లక్ష్యాన్ని పెంచుకుంటూ హరిత తెలంగాణ వైపు ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డు, ఆర్‌సీఐ రోడ్డులలో రోడ్లకిరువైపులా నాటిన కానుగు, ఔషధ మొక్కలు ప్రస్తుతం పెద్దవవ్వడంతో రహదారులపై పచ్చని అందాలు నెలకొన్నాయి. ఎప్పటికప్పుడు మొక్కల కలుపు, పాదులు తీసి వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని పోస్తున్నారు. ఎక్కడైనా మొక్క ఎండిపోయినట్లయితే దాని స్థానంలో వెంటనే కొత్త మొక్కను నాటేలా చర్యలు చేపడుతున్నారు.

నిలువ నీడతో పాటు వ్యాయామానికి అనువుగా..

ఖాళీ స్థలాలు పెద్దఎత్తున కలిగి ఉండే గ్రామీణ ప్రాంతాల్లో హరితహారం మొక్కలు నాటేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. కానీ పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలం తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఉన్న స్థలంలోనే ఎక్కువ మొక్కలను నాటుతున్నారు. జల్‌పల్లి–మామిడిపల్లి కార్గో రోడ్డులో హెచ్‌ఎండీఏ అధికారులు నాటిన వేలాది మొక్కలు భారీ వనంగా మారి బాటసారులకు నిలువ నీడనిస్తున్నాయి. శ్రీరాం కాలనీ నుంచి మొదలుకొని జల్‌పల్లి గ్రామం, దేసీ దాబా, పద్మజా పామ్‌గ్రోవ్స్, మామిడిపల్లి వరకు 20 ఫీట్ల విస్తీర్ణంలో రోడ్డు మధ్యలో ఉన్న ఈ చెట్ల మధ్య స్థానికులు వాకింగ్ కూడా చేస్తున్నారు.